సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



కార్మికులకు వరం 'ఈ-శ్రమ్'

శామికులకు వెన్నుదన్ను..విపత్కర వేళ తోడుగా నిలిచేది ఈ-శ్రమ్ కార్డు. అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్రం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. - 8లో



ఆర్టీసీ బస్సుల అడ్డగింత

ఆటో కార్మికుల ఉసురు తీయవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఆటో కార్మికుల యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో

త్వరలో యూరియా వస్తుంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాకు త్వరలో 2,147 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి వి. తారకరామారావు తెలిపారు. 2.7 లక్షల ఎకరాల్లో పంటలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లాలో వరి పంట 2.12 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 24,310, పత్తి 4,220, చెరకు 5830, ఆయిల్‌పామ్ 3,400 ఎకరాల్లో సాగైనట్టు వెల్లడించారు.

న్యూస్‌రీల్

సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణ

- ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణ మరింత సమర్థవంతమవుతుందని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూం, విమెన్ వెల్‌నెస్ రూంలను ఆయన గురువారం ప్రారంభించారు. నూతన బ్యాండ్ పరికరాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమెండ్ కంట్రోల్ ద్వారా పోలీసింగ్‌లో కొత్తదనాన్ని తీసుకువచ్చి ప్రజలకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యమని, సమాజ రక్షణ, నేర నియంత్రణ, అత్యవసర సహాయక చర్యలు వేగవంతంగా నిర్వహించబడతాయని తెలిపారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో పాటు ఆసక్తికర రంగాల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎస్.థామస్ రెడ్డి, ఎస్‌బీ సీఐ రమేష్, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, ఏఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో అటవీ ఉత్పత్తుల దుకాణం



వీడీవీకే యూనిట్ పరిశీలిస్తున్న సుధారాణి

సీతంపేట: జిల్లా కేంద్రంలో అటవీఉత్పత్తుల దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు. మండలంలోని పలు వీడీవీకేలను గురువారం పరిశీలించారు. కొండచీపుర్లు మోడల్‌గా తయారు చేయాలన్నారు. చీపురు తయారీకి కావాల్సిన ముడిసరుకులు వంటివి తక్కువ ధరలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తయారీ నూతనంగా ఉంటే గిట్టుబాటు ధరలు వస్తాయని తెలిపారు. దిబ్బగూడలో పేపర్ ప్లేట్ తయారీ మిషన్, పసుపు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సీసీలతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ డీపీఎం ఆర్.వి.రమణ, డీపీఎం అనిల్, ఏపీఎం కమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులే...

- జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విజయనగరం: ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, సమాజాన్ని దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఉత్తమపౌరులను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

నెల్లిమర్ల: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లిమర్లలోని రామతీర్థం కూడలిలో ఉన్న ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయ సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించాలని, ఇప్పటి వరకు ఉన్న ఐఆర్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు, ఈఎల్ఎస్, సీపీఎస్, ఉద్యోగులు, ఉపాధ్యాయుల డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కె.ఎస్.జె.మోహన్, పీఆర్టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింగరావు, వి.శ్రీనివాసరావు, జి.శ్రీధర్‌నాయుడు, ఎ.జగన్నాథరావు, ఎస్.రజిని, ఎ.గీతాంజలి, ఎం.శ్రీదేవి, సీహెచ్ లక్ష్మి పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలే

పాఠాలు చెబుతాయ్!



కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాల

- అధ్యాపకులు లేకుండానే నడుస్తున్న గురుకుల కళాశాలలు
- కీలక సబ్జెక్టులు బోధించేవారే కరువు
- కుంటుపడుతున్న విద్యార్థుల విద్యాప్రమాణాలు
- ఆశ్రమ పాఠశాలల్లోనూ అదే పరిస్థితి
- ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ శూన్యం

సాక్షి, పార్వతీపురం మన్యం: గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో అధ్యాపకులు లేకుండానే చదువులు 'సాగిపోతున్నాయి'. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. కీలక సబ్జెక్టులను బోధించే గురువులను ఇప్పటికీ నియమించుకోలేకపోయారు. ఫలితంగా విద్యాప్రమాణాలు కుంటు పడుతున్నాయి. పర్యవేక్షించాల్సిన ఐటీడీఏ.. గిరిజన విద్యను గాలికొదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాలయాల్లో చదివేస్తోమతే లేక పేద, గిరిజన విద్యార్థులు గురుకులాలను ఆశ్రయిస్తున్నారు. పదో తరగతిలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినా.. ఇంటర్ విద్యకు వచ్చేసరికి చతికిలపడుతున్నారు.

సందర్శించిన దాఖలాల్లేవ్..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 55 గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలబాలికలు పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవులు పూర్తయి, విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలకుపైగా అవుతోంది. ఇంత వరకు ఏ పాఠశాలనూ గిరిజన సంక్షేమ అధికారులు సందర్శించిన దాఖలాలు లేవు. సౌకర్యాలు, పర్యవేక్షణ లేక విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఒక్క కురుపాం నియోజకవర్గం పరిధిలోనే నలుగురు విద్యార్థులు మృతి చెందారు. గిరిజన సంక్షేమ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గిరిజన సంఘాల నుంచి వినిపిస్తున్నాయి.

ఒకరిద్దరు కాదు..

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 10 గురుకుల కళాశాలలున్నాయి. పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ.. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరిలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జువాలజీ.. కురుపాం బాలికల కళాశాలలో ఇంగ్లిష్, ఫిజిక్స్.. భద్రగిరి బాలుర గురుకుల కళాశాలలో ఎకనామిక్స్.. సీతానగరం మండలం జోగింపేట ఎస్‌ఓఈలో తెలుగు.. పి.కోనవలస బాలుర కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకులు లేని పరిస్థితి ఉంది. కొమరాడలో పీజీటీ ఇంగ్లిష్, లెక్కలు, ఫిజిక్స్, సైన్స్, సోషల్, టీజీటీ సైన్స్ బోధించేవారు లేరు. పి.కోనవలసలో ఏకంగా ఐదు సబ్జెక్టులకు బోధకులు లేకపోవడం గమనార్హం. సీతంపేట ఐటీడీఏ పరిధిలోనూ ఇదే స్థితి. దాదాపు ప్రతి విద్యాలయంలోనూ ఒకరిద్దరైనా లేకపోవడం గమనార్హం.

ఆశ్రమంలో సమస్యల తిష్ట

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతోంది. వసతి అధ్వానంగా ఉంటోంది. సరిపడా మరుగుదొడ్లు లేవు. నిద్రించడం, చదువుకోవడం ఒకేచోట అవుతోంది. చాలా వరకు విద్యాలయాలకు భోజన శాలలు లేవు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో 102 ఆశ్రమ పాఠశాలలు, 27 గురుకుల పాఠశాలలు, 34 వరకు పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వీటి పరిధిలో 42 వేల మంది వరకు విద్యార్థులున్నారు. ఈ విద్యాసంస్థల్లో సమస్యలు రాజ్యమేలుతున్నా.. పర్యవేక్షించాల్సిన ఐటీడీఏ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

అధ్యాపకులు లేకపోతే చదువులెలా?

గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో అధ్యాపకులు లేకుండా పిల్లల చదువులెలా సాగుతాయి? ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేద గిరిజన విద్యార్థుల ఇంటర్ చదువులకు ఆటంకం కలుగుతోంది. తక్షణమే అధ్యాపకుల నియామకాలు చేపట్టాలి.

– పాలక రంజిత్‌కుమార్, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ సంఘం

కురుకూటి వార్డెన్‌పై చర్యలు



కురుకూటి బాలికల ఆశ్రమ పాఠశాలలో విచారణ చేస్తున్న డీడీ కృష్ణవేణి

సాలూరు రూరల్: సాలూరు మండలంలోని కురుకూటి బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. బాధ్యతల నుంచి తప్పించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను వార్డెన్ లిల్లీ కొడుతున్నట్లు ఇటీవల డీడీకి ఫిర్యాదు అందింది. ఆ మేరకు గురువారం ఆమె ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులు, సిబ్బందిని విచారణ జరిపారు. అనుమతి లేకుండా గేటువద్దకు వచ్చిన తల్లిదండ్రులతో పిల్లలు మాట్లాడుతుండడంతో వార్డెన్ కొట్టినట్లు తేలింది. దీనికి చర్యగా వార్డెన్‌ను బాధ్యతల నుంచి తొలగించి ఆ బాధ్యతలు శ్రీదేవి అనే ఉపాధ్యాయురాలికి అప్పగించినట్లు డీడీ కృష్ణవేణి తెలిపారు.

7న కోటదుర్గమ్మ ఆలయం మూసివేత

పాలకొండ: చంద్రగ్రహణం ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ నెల 7న పాలకొండ కోటదుర్గమ్మవారి ఆలయం తలుపులు మూసివేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం మూసివేస్తామని, తిరిగి 8న ఉదయం 7 గంటల నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందని వివరించారు.

8 నుంచి తెరచాటుకు కోటదుర్గమ్మవారు

దసరా ఉత్సవాల సందర్భంగా కోటదుర్గమ్మవారు ఈ నెల 8వ తేదీ నుంచి తెరచాటుకు వెళ్లనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి అమ్మవారి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు 15 రోజులు ముందు నుంచి అమ్మవారు తెరచాటుకు వెళ్లడం ఆనవాయితీ. తిరిగి 22న అమ్మవారి నిజరూపదర్శనం ఉంటుందని ఆలయ ఈఓ సూర్యనారాయణ తెలిపారు. భక్తులు ఈ విషయం గమనించాలని కోరారు.

93 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



పార్వతీపురం టౌన్:

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 93 మందిని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. ఇందులో హెచ్ఎంలు 14 మంది, జూనియర్ లెక్చరర్లు ముగ్గురు, స్కూల్ అసిస్టెంట్లు 36, సెకెండరీ గ్రేడ్ టీచర్లు 40 మంది ఉన్నారు. వీరికి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కల్యాణ మండపం వేదికగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అవార్డులను, ప్రశంసాపత్రాలను శుక్రవారం అందజేయనున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులు ఉదయం 9.30 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని డీఈఓ బి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

జిల్లాస్థాయి అవార్డులకు ఎంపికైనది వీరే..

హెచ్ఎంలు

బిడ్డిక ప్రసాద్ (ఎంపీపీఎస్ పాసుకుడి, భామిని), వి.శ్రీనివాసరావు(జెడ్పీహెచ్ఎస్ రావివలస), కె.త్రినాథరావు (ఎంపీపీఎస్ జియమ్మవలస), కె.అనూరాధ (టీడబ్ల్యూజీ హెచ్ఎస్, సరాయివలస), బి.సంఘంనాయుడు (జెడ్పీహెచ్ఎస్, ఎం.సింగిపురం), ఎం.ఈశ్వరరావు (జెడ్పీహెచ్ఎస్ నర్సిపురం గోరి), ఎల్.వెంకటరావు (జీటీడబ్ల్యూహెచ్ఎస్, పార్వతీపురం), ఎస్.రాజు (ఎంపీపీఎస్, బంగారమ్మకాలనీ), బి. శ్రీనివాసరావు (జెడ్పీహెచ్ఎస్, వెంకట భైరపురం), బి.ప్రభాకరరావు (జీఈఎస్, సీతంపేట), డి.నాగమణి (జెడ్పీహెచ్ఎస్, తెట్టంగి), టి.జగన్నాథరావు (ఎంపీపీఎస్, కుంబిడి చ్ఛాపురం), డి.శివున్నాయుడు (ఎంపీపీఎస్, కూనేరు), డి.మణి (కేజీబీవీ, పార్వతీపురం)

స్కూల్ అసిస్టెంట్లు..

ఎన్.రాజశేఖర్ (జెడ్పీహెచ్ఎస్ బత్తిలి), ఎస్.రమేష్ (పెద్దదిమిలి), ఎస్.రామకృష్ణ (ఉల్లిభద్ర), కె. కృష్ణచంద్ర (రావివలస), ఎన్.గౌతమి (తోటపల్లి), ఎల్.సత్యనారాయణ (జియమ్మవలస), జి.లక్ష్మునాయుడు (చిన్నకుదమ), ఎం.శ్రీనివాసరావు (కురుపాం), జి.రాంబాబు (హుడాకాలనీ), వి.పెంటన్నాయుడు (ఎం.సింగిపురం), ఆర్.గౌరినాయుడు (ఎన్.ములగ), జె.శ్యామ్‌సుందరరావు (ఎమ్మార్‌నగరం), జె.పార్వతి (సీతంపేట), కె.శ్రీరాములు, డి.రామారావు(సీతానగరం), కె.రమేష్ (మరిపివలస), వై.వెంకటరమణ (బిటివాడ), బి.యోగేశ్వరరావు (నర్సిపురంగోరీ), జి.భారతి (బందలుప్పి), సీహెచ్ శ్రీనివాసరావు (పార్వతీపురం), కె.రమణమ్మ (సాలూరు), మండ పద్మజ (పెదబోరబంద), ఎ. జానకిరామరాజు (సాలూరు), టి.సూర్యనారాయణ (ఏపీఎంఎస్ పుట్టూరు), సీహెచ్ నవి (పురోహితునివలస), కె.గిరిబాబు (కూర్మరాజుపేట), టి. శ్రీనివాసరావు (మక్కువ), వి.నారాయణరావు (కృష్ణపల్లి), ఎస్.వేణుగోపాలరావు, ఎస్.శ్యామ్ (ఎంపీఎల్‌హెచ్ఎస్-సాలూరు), జె.రోజాలక్ష్మి (జీటీడబ్ల్యూహెచ్ఎస్-సీతంపేట), ఎం.శివకుమార్ (జీహెచ్ఎస్ సీతంపేట), వై.కైలాసరావు (జీటీడబ్ల్యూహెచ్, గంగోపేట), టి.చంద్రరావు (జీటీడబ్ల్యూహెచ్-సీతంపేట), కేటీటీవీ పోలినాయుడు (చినగోరి), జి.వరప్రసాద్ (జీటీడబ్ల్యూఏహెచ్ఎస్-బెలగాం).

సెకెండరీ గ్రేడ్ టీచర్లు..

పి.అప్పన్న (ఎంపీపీఎస్-తాలాడ), ఎస్.సుబ్బారావు- గుమ్మలక్ష్మీపురం ఆర్ఎస్ కాలనీ, టి.రాధిక-కూరసింగి, ఎల్.హరగోపాల్-పీజేవలస, కె.నారాయణరావు-పి.లేవిడి, కె.వెంకటరమణ-సీతారాంపురం, ఎం.మహేష్-లఖనాపురం, పి.వెంకటనాయుడు-ఉల్లిభద్ర, కె.శ్రీనివాసరావు-నీచుకువలస, ఆర్.రాంప్రసాద్ నాయుడు-చిలకనివానివలస, వనజాక్షి-ఎస్.ఎం.పురం, టి.అప్పలనాయుడు-విక్రంపురం, పి.కామేశ్వరరావు-కూనేరు, పీవీజీ రాజు-దుగ్గి, బి.శంకరరావు-డి.శిర్లాం, బలగ నాగమణి- సింగన్నవలస, ఎస్.వాసుదేవరావు-ఎన్.కె.రాజపురం, పద్మ-పాలకొండ, పి.రామకృష్ణ-బాసూరు, ఎస్.పార్వతి-పెదకాపువీధి, పాలకొండ, వై. నిర్మలాకుమారి- వేదమ, జి.రామినాయుడు-బాలగుడబ, వై.శివజ్యోతిలలిత కుమారి-సీతన్నదొరవలస, జె.ముత్యాలు-దొగరావలస, కె.ప్రమీల-దిగువసెంబి, గంగన్న దొర-జైపురం, పి.కృష్ణారావు-జోనగ, ఎం. ప్రసాద్-హడ్డుబంగి, కె.భాస్కరరావు-నిడగల్లు, సీహెచ్ ఈశ్వరరావు-పనుకుపేట, బి.వాసుదేవరావు-కిమ్మి, ఎ.సూర్యనారాయణ-వండవ, ఎ.స్వామిబాబు-హుస్సేనపురం, కె.ప్రమీలారాణి-బారుగ, టి.శ్రీనివాసరావు జీపీఎస్‌టీడబ్ల్యూ, బాలేరు, వి.వరలక్ష్మి-కేజీబీవీ,కొమరాడ, టి.శంకరరావు జీపీఎస్ కాగువమానుగూడ, వై.ప్రదీప్ ఎంపీఈఎల్ పీఎస్ బొడ్డవలస, కె.ఈశ్వరరావు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జోగింపేట, శోభారాణి పట్నాయక్ కేజీబీవీ జోగింపేట.

జూనియర్ లెక్చరర్లు

సుకన్య (జీజే కాలేజ్,పార్వతీపురం), ఎం.గోవిందరావు (జీజే కాలేజ్ వీరఘట్టం), టి.శ్రీధర్ (జీజే కాలేజ్, పార్వతీపురం)

సత్వర గుర్తింపుతో కేన్సర్ నిరోధం

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: సత్వర గుర్తింపుతో కేన్సర్ బారి నుంచి తప్పించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్. భాస్కరరావు అన్నారు. ఎన్‌సీడీ 4.0లో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌పై సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలకు ఎన్సీడీ పీఓ డాక్టర్ జగన్ మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఎన్జీఓ హోంలో శిక్షణ నిర్వహించారు. గైనకాలజిస్ట్, డెంటల్ వైద్యులు కేన్సర్ స్క్రీనింగ్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కేన్సర్ కేసులు ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం ఎక్కువగా నమోదవుతున్నాయని, క్షేత్రస్థాయిలోనే సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే, వ్యాధి తీవ్రం కాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డా టి. జగన్మోహనరావు, డీఐఓ డా.విజయమోహన్, ఎపిడమాలజిస్ట్ డా కౌశిక్, ట్రైనర్స్ గైనకాలజిస్ట్ డా.పూర్ణచంద్రిక, డెంటల్ సర్జన్స్ డా.సుకత, డా.రమ్య, డీఐఓ తాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు

ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిత



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: ఉన్నత లక్ష్యాలతో ఉజ్వల భవిత సొంతమవుతుందని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని వాటిని సాకారం చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని బాలికలకు హితబోధచేశారు. పాఠ్యాంశాలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెటాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మెనూ పరిశీలించారు. బాలికలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట ఏపీఓ చిన్నబాబు ఉన్నారు.

జమ్ముకశ్మీర్‌లో యారడ్లవలస గిరిజనుడు

- ఏడాది కిందట తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం
- కుటుంబ సభ్యులతో మాట్లాడించిన పోలీసులు
- స్వగ్రామం తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

పాచిపెంట: మండలంలోని పద్మాపురం పంచాయతీ యారడ్లవలస గ్రామానికి చెందిన బడ్నాన చిన్నారావు గతేడాది రొయ్యల చెరువులో పనిచేసేందుకు కొంతమంది వ్యక్తులతో కలిసి ప్రకాశం జిల్లా టంగుటూరు బయలుదేరాడు. అక్కడ పనిచేస్తూ సరుకుల కొనుగోలు కోసం వెళ్లి తప్పిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పాచిపెంట పోలీస్ స్టేషన్‌లో అప్పట్లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు చిన్నారావు ఆచూకీ కోసం పోలీసులు పలు ప్రాంతాల్లో పర్యటించగా, చివరకు జమ్ముకశ్మీర్‌లో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు గురువారం సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడించారు. చిన్నారావుది నిరుపేద కుటుంబం. చార్జీలకు కూడా డబ్బులు లేని పరిస్థితి. జమ్మూలో చిక్కుకుపోయిన చిన్నారావును తెచ్చే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు.



తప్పిపోయిన వ్యక్తి ఫోటో చూపిస్తూ స్వగ్రామానికి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న కుటుంబ సభ్యులు

కుంకీ ఏనుగులు వచ్చేనా..?

- పదేళ్లుగా మన్యంలో అటవీ ఏనుగుల సంచారం
- 13 మంది మృత్యువాత
- వేల ఎకరాల్లో పంటల నష్టం



కురుపాం నియోజకవర్గంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: కురుపాం నియోజకవర్గ ప్రజలను ఏనుగుల బెడద వెంటాడుతోంది. చేతికందిన పంటలను నష్టపరుస్తున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. కుంకీ ఏనుగులను ఈ ప్రాంతానికి తీసుకురాలేదు. కుంకీ ఏనుగులు వచ్చేదెన్నడో..? పదేళ్లుగా సంచరిస్తున్న ఏనుగుల గుంపును తరలించేదెన్నడో..? అని ఎదురు చూస్తున్నా నిరాశే మిగులుతోంది. ప్రస్తుతం 9 ఏనుగుల గుంపు కొమరాడ మండల పరిసర ప్రాంతాల్లో సంచరించి రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులకు అపార నష్టం మిగుల్చుతున్నాయి. పదేళ్లలో 13 మంది రైతుల ప్రాణాలను సైతం తీశాయి. మరో నాలుగు ఏనుగుల గుంపు కురుపాం తూర్పు ముఠా ప్రాంతమైన జరడ పంచాయతీలోని జరడ, జంపరకోట, నెమలిమానుగూడ, పాడిదం, గెడ్డగూడ గిరిశిఖర గ్రామాల్లో నెల రోజులుగా సంచరిస్తూ గిరిజనులు సాగు చేస్తున్న పోడు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రభుత్వం, అటవీశాఖ ధికారులు స్పందించి కుంకీ ఏనుగుల తో అటవీ ఏనుగుల గుంపు తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు,

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ కె.శిరీష

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి వనంగుడి, చదురుగుడి హుండీల ఆదాయాన్ని గురువారం పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలోను, వనంగుడి ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.శిరీష మాట్లాడుతూ 44 రోజులకు గాను చదురుగుడి హుండీల నుంచి రూ.15 లక్షల 62వేల 461 నగదు, 12 గ్రాముల350 మిల్లీ గ్రాముల బంగారం, 216 గ్రాముల వెండి లభించాయన్నారు. అదేవిధంగా వనంగుడి హుండీల నుంచి రూ.3 లక్షల 64వేల 803 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.8750 ఆదాయం లభించిందన్నారు. భక్తులు ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వైవీ.రమణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

విజయనగరం లీగల్: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో వాహన ప్రమాదాలు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎన్ఐఏ, ఎక్సైజ్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత సివిల్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. పూల్‌బాగ్ కాలనీ హనుమాన్ నగర్‌లోని ఎంఆర్‌వీజీఆర్ పీజీ బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలోని నూతన కోర్టు భవనంలో ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయండి


• ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి



వీరఘట్టం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

వీరఘట్టం: సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వీరఘట్టం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్రైమ్ రికార్డులను పరిశీలించారు.అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడుతూ ముఖ్యంగా డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు నిఘా పెట్టాలని చెప్పారు. యువత చెడు మార్గాలను అవలంబించకుండా కాలేజీలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయని ఆరాతీశారు.శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. అంతకుముందు స్థానిక ఎస్సై కళాధర్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఎస్పీకి స్వాగతం పలికారు. ఎస్పీతో పాటు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి, పలువురు ఎస్సైలు ఉన్నారు.

ఆయన చూపు సజీవం



బీఎస్ అప్పల నాయుడు (ఫైల్)

చీపురుపల్లి: బతికున్నప్పుడు మాత్రమే కాదు మరణించిన తరువాత కూడా చూపు సజీవంగా ఉండాలంటే నేత్రాలు దానం చేయాలి. ప్రతి మనిషి మరణానంతరం శరీరంతో పాటు అవయవాలు కూడా కాలి బూడిదవ్వాల్సిందే. కానీ ఆ చూపు సజీవంగా ఉండాలంటే మాత్రం నేత్రాలు దానం చేయాలి. పట్టణంలోని మెయిన్‌రోడ్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బీఎస్.అప్పలనాయుడు కుటుంబసభ్యులు అదే పని చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పట్టణంలోని ఆంజనేయపురానికి చెందిన బీఎస్.అప్పలనాయుడు(86) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. దీంతో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు నేత్రదానం చేయాలంటూ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీనికి వారు అంగీకరించడంతో విజయనగరం రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం ఇవ్వగా అక్కడి నుంచి టెక్నీషియన్ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి నుంచి కార్నియా సేకరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹141	₹252	₹262

కార్మికులకు వరం ఈ-శ్రమ్



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం



ఈ-శ్రమ్ కార్డులు



అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ నమోదు చేస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: శ్రామికులకు వెన్నుదన్ను..విపత్కర వేళ తోడుగా నిలిచేది ఈ-శ్రమ్ కార్డు. అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ-శ్రమ్ కార్డు పొందడం పూర్తిగా ఉచితమైనా అవగాహన లోపం వల్ల చాలా మంది ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. టైలర్లతో సహా చాలా రంగాలకు చెందిన శ్రామికులు ఈ-శ్రమ్ కార్డు పొందడానికి అర్హులు. నమోదు కూడా సులభం. ఈ-శ్రమ్‌లో నమోదైన కార్మికులు, వలస కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పలు ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ డేటాబేస్ ఆధారంగా ఉపాధి,నైపుణ్యాభివృద్ధి కల్పిస్తారు. నిజంగా శ్రామికుల పాలిట' ఈ-శ్రమ్' ఓ వరం వంటిదని చెప్పవచ్చు. కార్మికశాఖ ఎంత కసరత్తు చేస్తున్నా ఇంకా పెద్ద సంఖ్యలో కార్మికులు ఈ-శ్రమ్ కార్డు పొందలేదు. ఈ-శ్రమ్ నమోదు కోసం ప్రత్యేకంగా ఆగస్టు 25 తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

కార్డు ఎలా పొందాలి?

ఈ-శ్రమ్ కార్డు పొందడం చాలా సులభం. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవాళ్లు 'ఈ-శ్రమ్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి సొంతంగా ప్రక్రియ పూర్తి చేయవచ్చు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు, మీ-సేవ, సీఎస్‌సీ సెంటర్లలో వివరాలను నమోదు చేసుకుని కార్డు పొందవచ్చు. బ్యాంకు అకౌంట్ నంబర్, అకౌంట్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆధార్ కార్డు, ఫొటో ఉంటే సరిపోతాయి. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత సెల్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. కార్డును ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

అర్హులెవరంటే..?

అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్నకారు, కౌలు రైతులు, కూలీలు, పశుపోషణ, వడ్రంగి, ఉప్పు తయారీ, ఇటుకబట్టీ, రాతి క్వారీ కార్మికులు, పనిమనుషులు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, చేతివృత్తుల వాళ్లు, వీధి వ్యాపారులు, ఆశ, అంగన్వాడీ వర్కర్లు, టైలర్లు, మత్స్యకారులు, నర్సరీ కూలీలు, ఉపాధి కూలీలు, భవననిర్మాణ కార్మికులు, పాల వ్యాపారులు, కొరియర్, పేపర్ బాయ్స్, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెరికల్చర్, హమాలీలు, హోంమెయిడ్స్, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో సభ్యత్వం లేనివారు, ఆదాయపు పన్ను పరిధిలో లేనివాళ్లు అర్హులు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి.

నగదు వసూలు చేస్తే చర్యలు..



ఈ-శ్రమ్ పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటివరకు ఏడుగురికి ప్రమాద బీమా పరిహారం అందజేశాం. ఒక ఇంటిలో ఎంత మంది ఉన్నా ఈ పథకానికి అర్హులే. కార్మికుల పేర్ల నమోదుకు కామన్‌సర్వీస్ సెంటర్లు, సచివాలయాల్లో నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ-శ్రమ్ కార్డు అందించి త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటాం.

–ఆర్.రమాదేవి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం జిల్లా

కోళ్ల మరణాలను ఆపేందుకు సస్యరక్షణ చర్యలే మార్గం..

• పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు

కొత్తవలస: కొత్తవలస సబ్‌డివిజన్ పరిధిలో కొత్తవలస, లక్కవరపుకోట మండలాలతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ఇటీవల లక్షకుపైగా పౌల్ట్రీ, నాటుకోళ్ల మృత్యువాత పడుతున్నాయని ఈ మరణాలను అరికట్టేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఒక్కటే మార్గమని పశువర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.దామోదరరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో వింత వ్యాధితో లక్షకుపైగా కోళ్ల మృతి శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కొత్తవలస ఎ.డి కార్యాలయంలో రెండు మండలాల పశువైద్యాధికారులు, సచివాలయం పశుసహాయకులతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. చనిపోయిన కోళ్ల నమూనాలను పరీక్ష నిమిత్తం విజయవాడ సెంట్రల్ లేబొరేటరీకి పంపించామని వ్యాధి నిర్ధారణ నివేదికలు రాలేదని డీడీ తెలిపారు. ఈ సందర్భంగా డీడీ దామోదరరావు మాట్లాడుతూ లక్షకు పైగా కోళ్లు మృతి చెందడం వాస్తవమేనన్నారు. పౌల్ట్రీల్లో మరో రెండు నెలల వరకు కొత్త పిల్లలను పెంచవద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి పక్షులు చనిపోయినా గ్రామానికి దూరంగా గొయ్యి తీసి పాతిపెట్టాలని చెప్పారు. పౌల్ట్రీల్లో పనిచేసే కార్మికులు మిగిలిన కోళ్లకు వైరస్ సోకకుండా ఉండేందుకు శానిటైజేషన్ చేయాలన్నారు. ఈ జాగ్రత్తలపై గ్రామాల్లో దండోరా వేసి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎ.డి కన్నంనాయుడు, రెండు మండలాల పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

'సూపర్ స్కూల్'గా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల



సూపర్ స్కూల్‌గా ఎంపికైన ప్రశంసాపత్రం, మెమెంటోను చూపిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో గల మహాత్మా జోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో సూపర్ స్కూల్ కేటగిరి-ఎలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో గురువారం తెలిపారు.ఈ మేరకు 3వ తేదీన విజయవాడలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల కార్యదర్శి మాధవీలత చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ఉతీర్ణత,ఈ ఏడాది పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకీ ఎంపిక కావడం, పాఠశాలలో గ్రంథాలయం నిర్వహణ, పర్యావరణ హిత ప్రాజెక్టులు తదితర అంశాల్లో మిగిలిన బీసీ గురుకుల విద్యాలయ సంస్థలకు భిన్నంగా నిర్వహించడం వల్ల ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఈ ఘనత సాధనకు కృషిచేసిన బోధనా సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

చదువుకున్న చోటే బోధన

పార్వతీపురం రూరల్: విద్యార్థి జీవితంలో కళాశాల జ్ఞాపకాల నిలయం. ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, అనుభవాలు జీవితాంతం మార్గనిర్దేశం చేస్తాయి. ఆ విద్యార్థుల్లో కొందరు మాత్రమే ప్రతిభ, కృషి నిబద్ధతతో భవిష్యత్‌లో గురువులుగా మారుతారు. విద్యార్థిగా తరగతి గదిలో కూర్చుని గురువు వెలిగించిన జ్ఞాన దీపంతో మంచి మార్గంలో నడుస్తూ గతంలో కళాశాల తరగతి గదుల్లో పాఠాలు నేర్చుకున్న వారే అదే తరగతి గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ అధ్యాపకులుగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తూ పలువురికి ఆదర్శనమవుతున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా, ఎకనామిక్స్ అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు గతంలో ఇదే కళాశాలలో ఇంటర్‌మీడియట్ పూర్తిచేశారు. ప్రస్తుతం వారు చదువుకున్న చోటే ప్రిన్సిపాల్‌గా ఒకరు, అధ్యాపకుడిగా మరొకరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వారు చదువుకున్న ఆనాటి జ్ఞాపకాలను వారి మాటల్లో తెలుసుకుందాం.

నాడు విద్యార్థిగా నేడు ప్రిన్సిపాల్‌గా



మా స్వగ్రామం సీతానగరం మండలం మరిపివలస కావడంతో రోజూ ఉదయం 8గంటలకు కళాశాలకు సైకిల్‌పై స్నేహితులతో కలిసి చేరుకునేవాళ్లం. సాయంత్రం 6గంటల వరకు కళాశాలలోనే ఉండే వారం. నాకు తక్కువ మార్కులు వచ్చిన కారణంగా ఎంపీసీలో సీటు ఆశించినప్పటికీ బైపీసీలో సీటు దక్కింది. ఈ కళాశాలలో విద్యార్థిగా జీవితానికి ఉపయోగపడే చాలా పాఠాలు నేర్చుకున్నాను. ఊహించని రీతిలో ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తానని అనుకోలేదు. 1990లో ఈ కళాశాలలో ఇంటర్‌మీడియట్ పూర్తిచేశాను. అనంతరం 2003లో బోటనీ అధ్యాపకుడిగా కళాశాలకు వచ్చి నేడు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించడం, చదువుకున్న చోటే ఉద్యోగం చేయడం ఆసక్తిగా ఉంది. – ఆకుల రాజు, ప్రిన్సిపాల్, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల

6 నుంచి ఇంటర్ వరకు



మా నాన్నగారు ఇదే కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేసేవారు. ఈ క్రమంలో 1978 నుంచి 1985 వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇదే కళాశాలలో చదువుకున్నాను. అయితే ఇదే కళాశాలలో ప్రస్తుతం ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేసే అవకాశం కలగడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. ఒకప్పుడు నేను కూర్చుని విద్యాబుద్ధులు నేర్చుకున్న చోటే అధ్యాపకుడిగా బోధన చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు.

–టి.రవికుమార్, గుమ్మలక్ష్మీపురం

మాటలకే పరిమితమైన మంత్రి హామీలు



కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జగన్నాథపురానికి వెళ్లే మట్టిరోడ్డు..బయటకొచ్చేసిన పైపు కల్వర్టులు

మెంటాడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జగన్నాథ పురానికి వెళ్లేమార్గంలో ఉన్న తాత్కాలిక పైపు కల్వర్టు పైన ఉన్న మట్టి మొత్తం కోతకు గురైంది. పైపులు మాత్రమే మిగిలాయి. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జనసేన నాయకులు ఎన్నికల ముందు జగన్నాథపురం గ్రామానికి ఆంధ్ర ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి తారురోడ్డు, చంపావతి నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని ముమ్మర ప్రచారం చేశారు. గుమ్మడి సంధ్యారాణి అయితే ఒక అడుగు ముందుకేసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పదవి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు జగన్నాథపురం యువత 12 సార్లు ఆమెకు దరఖాస్తులు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదు. రోడ్డు, బ్రిడ్జి గురించి ప్రశ్నిస్తే గ్రామంలోని కూటమినేతలు ఇదుగో..వస్తుంది అదుగో..వస్తుంది అని చెప్పుకువస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లాగానే ఈ హామీ కూడా గాలిలో కలిసి పోతుందేమోనని ఇక్కడి ప్రజలు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.

యూరియా అందక వెనుదిరిగిన అన్నదాతలు



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి సచివాలయానికి బుధవారం రాత్రి 150 బస్తాల యూరియా వచ్చింది. ఈ యూరియాను రేగ, కళ్లేపల్లి, పూడివానిపాలెం, సీతాగొర్లెవానిపాలెం, శ్రీరాంపురం, తామరాపల్లి గ్రామాలకు చెందిన రైతులకు అందజేస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున రైతులు గురువారం ఉదయం 9 గంటలకే సచివాలయం ముందు క్యూ కట్టారు. ఇంతలో కూటమి నాయకులు సచివాలయం వద్దకు చేరుకుని వారికి నచ్చిన వారికి యూరియాను అందజేశారు. దీంతో ఉదయం నుంచి లైన్‌లో నిల్చున్న రైతులకు యూరియా దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని వాపోయారు. రైతులను ఉసురు పెట్టిన ప్రభుత్వాలు ఎంతకాలం పాలన చేయలేవంటూ రైతులు శాపనార్థాలు పెట్టారు.

మంచిసినిమాలను ప్రోత్సహించాలి

• మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఆర్.నారాయణమూర్తితో కలిసి సినిమా చూస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: మంచి సినిమాలకు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. పీపుల్స్ స్టార్ ఆర్‌నారాయణమూర్తి దర్శకత్వం వహించిన యూనివర్సిటీ పేపర్‌లీక్ సినిమాను నారాయణమూర్తితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలో గురువారం రాజన్నదొర చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నారాయణమూర్తి ఎప్పుడూ మంచి చిత్రాలనే తీస్తుంటారని, సామాజిక అంశాలపై ఆయన తీసే సినిమాలు ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నాయన్నారు. ఇటువంటి మంచి సినిమాలు మరిన్ని రావాలంటే ప్రభుత్వం ఇటువంటి సినిమాలను ప్రోత్సహించాలని కోరారు. తమ సినిమాను నేరుగా వచ్చి చూడడంతో పాటు తన వెంట అధిక సంఖ్యలో అభిమానులతో సినిమా చూసిన రాజన్నదొరకు నారాయణమూర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వ్యక్తి గల్లంతు



గల్లంతైన గిరడ రాజు



గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్

విజయనగరం క్రైమ్: నగరంలోని అయ్యన్నపేట వద్ద ఓ వ్యక్తి అదృశ్య మయ్యాడని విజయనగరం వన్ టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయ్యన్నపేటకు చెందిన గిరడ రాజు(34) గణేష్ నిమజ్జనానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి అప్పలనాయడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టామన్నారు. వినాయక నిమజ్జనంతో చెరువులోకి వెళ్లిన రాజు జాడ కానరాకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్‌తో గాలింపు చేపడుట్టామని సీఐ చౌదరి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాద స్థలంలో మృతిచెందిన అర్జున రావు

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో రంగరాయపురం జంక్షన్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపాడ మండలం చామలాపల్లి గ్రామానికి చెందిన పెద్దాడ అర్జునరావు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భార్య, కుమారుడితో కలిసి విశాఖ జిల్లా చిన్న ముషిడివాడలో అర్జునరావు నివాసముంటున్నాడు. తమ స్వగ్రామంలో వినాయక నిమజ్జన మహోత్సవానికి బైక్‌పై వెళ్తుండగా రంగరాయపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టిన అర్జునరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

బొలెరో ఢీకొని యువకుడు..



సాయి మృతదేహం

బొండపల్లి: మండలం కేంద్రంలోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన కు సంబంధించి ఎస్సైయు. మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి మక్కువకు ముగ్గురు యువకులు బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో బొలెరోను బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదంలో బైక్‌పై కూర్చున్న దాసరి సాయి(20)తీవ్రంగా గాయపడి విజయనగరంలోని కేంద్ర సర్వ జన ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఆవాల రాజేష్ బైక్ నడుపుతూండగా, వెనుక ఎస్.రఘు ఉన్నాడు. గాయపడిన వారిద్దరినీ చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సుల అడ్డగింత



ర్యాలీగా వెళ్తున్న ఆటో యూనియన్ కార్మికులు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను అడ్డుకుంటున్న ఆటో కార్మికులు

• ఆందోళనకు దిగిన ఆటో కార్మికులు
• యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
• నెలకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్

బొబ్బిలి: ఆటో కార్మికుల ఉసురు తీయవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఆటో కార్మికుల యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను అడ్డగించి నిరసన చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ వద్ద నిరసన ప్రదర్శన చేపడుతున్నప్పుడు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు అటు వైపు వెళ్లడంతో కార్మికులు అడ్డుకున్నారు. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పొట్నూరు శంకరరావు, ఆటో కార్మికుల సంఘం నాయకులు ఎ.మోహనరావు, బీటీఆర్ గంగరాజు, వీరన్న, జయరాం తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తచట్టాలతో భారీ జరిమానాలు విధిస్తోందన్నారు. బీఎన్ఎస్ 106లోని పలు సెక్షన్ల ప్రకారం ఆటోలను నడపడమే కష్టతరంగా మారిందని వాపోయారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం పుండుపై కారం జల్లినట్టు ఫ్రీ బస్సు ప్రవేశపెట్టిందని, దీంతో మహిళలెవరూ ఆటోలు ఎక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వేదాంతకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

అంతే కాకుండా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న రాష్ట్రం దానిని అసలు పట్టించుకోకుండా వేదాంత సంస్థకు ఫిట్‌నెస్, బ్రేక్ సర్టిఫికెట్ల జారీ బాధ్యతను అప్పగించడం వల్ల ఆటో కార్మికులంతా అదనపు భారాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పట్టణమంతా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కార్మికులంతా పెద్ద పెట్టున నినదించారు. తమ సమస్యలను పరిష్కరిస్తామన్న చంద్రబాబు,పవన్ కల్యాణ్‌లు పత్తాలేకుండా పోయారన్నారు. వేదాంత సంస్థకు ఇచ్చిన బ్రేక్, ఫిట్‌నెస్ అనుమతులను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపును ప్రభుత్వమే భరించాలని, వెంటనే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 17న జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ పట్టించుకోకపోతే ఈనెల 19న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం శ్రీనుకు మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు త్రినాథ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్సై పి జ్ఞానప్రసాద్, సిబ్బంది ఆటో కార్మికులు బస్సులకు ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రాణాలు తీసేస్తున్న డీజేలు

• శ్రుతిమించుతున్న శబ్దాలు



హరీష్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: ఆనందాలు కాస్త ఆవిరవుతున్నాయి. సరదాలు మితిమీరుతున్నాయి. పండగలు ప్రాణాలు తీస్తున్నాయి. సాంస్కృతిక వైభవం చాటాల్సిన కార్యక్రమాల్లో విషాద ఛాయలు అలముకుంటున్నాయి. మారుతున్న కాలంలో సంప్రదాయాలను చాటిచెప్పాల్సిన పండగలలో సమష్టి కృషి, సమైక్య పనితనం మచ్చుకైనా కానరావడం లేదు. ఖర్చులు పెడుతున్నామనే భావన తప్ప భక్తి, ఆ పై సంస్కృతి పరిఢ విల్లడం లేదు. విజయనగరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వారం రోజులుగా అయిదు పోలీస్ స్టేషన్ల పరిధిలో అలాంటి ఘటనలే జరుగుతుండడం దారుణం. ఇటీవల విజయనగరం వన్ టౌన్ స్టేషన్ పరిధి కొత్త దుప్పాడలో ఓ యువకుడి ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో పెట్టిన భారీ శబ్దాలు (డీజే) ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడిని బలిగొన్నాయి. నిన్నకాక మొన్న విజయనగరం వన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, టూటౌన్ పీఎస్‌లో ఒకటి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు వినాయక నిమజ్జనాల్లో పాల్గొని సంబ్రమాశ్చర్యాల్లో మునిగి చివరకు కన్నవారికి దూరమయ్యారు. తాజాగా విజయనగరంలోని బొబ్బాదిపేటకు చెందిన బొబ్బాది హరీష్ (22) వినాయక నిమజ్జనం సందర్భంగా డీజే సౌండ్స్‌కు బుధవారం రాత్రి డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. డిగ్రీ పూర్తి చేసిన హరీష్ పోటీ పరీక్షలకు కోచింగ్ నిమిత్తం హైదరాబాద్ వెళ్లేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో ఈ దారుణ ఘటన జరిగింది.